www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

పెట్రోల్ దాడికి గురైన విద్యార్థిని మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న బాలిక తల్లి

ప్రజాశక్తి - బద్వేలు

ప్రేమోన్మాది చేతిలో పెట్రోల్ దాడికి గురైన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ (16) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. బద్వేల్ శివారు ప్రాంతంలో ఉన్న సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ సమీపంలో విఘ్నేష్ అనే వ్యక్తి మాట్లాడాలని పిలిచి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. 80 శాతం కాలిన గాయాలతో ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. కొన ఊపిరితో ఉన్న దస్తగిరమ్మ మృతువుతో పోరాడి చివరికి ప్రాణాలు విడిచింది. బాలిక మరణ వార్త విన్న తల్లిదండ్రులు గుండెలు అవిసేలా విలపించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తన బిడ్డకు అప్పుడే నూరేళ్లు నిండాయా అని రోధించారు. 'నిందితుడ్ని మీరు చంపుతారా లేక నన్నే చంపమంటారా' మృతురాలి తల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చూసిన స్థానికులు ఇంతటి కడుపుకోత ఎవరికి కలగకూడదని అన్నారు. ఈ సంఘటనతో బద్వేల్ పట్టణంలోని రామాంజనేయ నగర్‌లో విషా దఛాయలు అమ్ముకున్నాయి.



దస్తగిరమ్మ (ఫైల్‌ఫొటో)

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్

కడప అర్బన్ : బద్వేలులో ఇంటర్ విద్యార్థినిని దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా, డివైఎఫ్ఐ, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు ఐ.యన్.సుబ్బమ్మ, వీరణాలశివకుమార్, వీరపోగు.రవి, బి.దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి ముడియం చిన్ని ఎద్దు రాహుల్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళల పై నిత్యం దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నా యన్నారు. బద్వేలు లో జరిగిన సంఘటన సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందని అన్నారు. బాధితురాలు కుటుంబానికి రూ. 50 లక్షలు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ,ప్రేమోన్మాది విఘ్నేష్ నీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ రెబ్బ నరసింహలు జిల్లా సహాయ కార్యదర్శి ఆది తులసిశ్వర్ యాదవ్, శ్యామ్ పాల్గొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి శ్రీనివాసులురెడ్డి, మనోహర్, లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో నిందితుడిని శిక్షించాలని పేర్కొన్నారు.

మరణశిక్ష విధించాలి

బద్వేలు : బాలిక మృతికి కారకుడైన విఘ్నేష్‌కు మరణ శిక్ష విధించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలికావడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నేరస్తుడిని పట్టుకోవడంలో తీవ్రమైన కృషి చేసిన పోలీసు అధికారులను అభినందిస్తూ నిందితుడికి ఉరిశిక్ష విధించి, బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక పట్టణ నాయకులు ఎస్.కె మస్తాన్ షరీఫ్,కె.శివకుమార్, పి .మోక్షమ్మ, బాలమ్మ, కైరున్ బీ, ఫాతిమా, రాజగోపాల్,నరసింహ,రాయప్ప, శ్రీనివాసులు, హరి,యువరాజు పాల్గొన్నారు.

దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బాలికను అతి దారుణంగా చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, దిశ చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా పేర్కొన్నారు. ఆదివారం వైసిపికి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, దిశ చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకపోవడమే ఈ సంఘటనకు ప్రధాన కారణమని చెప్పారు. విచారణ వేగవంతం చేసి నిందితులను త్వరగా శిక్షించినప్పుడే ఎవరైనా తప్పు చేయా లంటే భయం కలుగు తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాక మల్ల రాజగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : బద్వేల్ వి ద్యార్థిని దస్తగిరమ్మపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఎపి నూర్ బాష్ ఎంప్లాయిస్ యూ నియన్ రాష్ట్ర అధ్యక్షులు పగిడాల సిద్ధయ్య, దూదే కుల సంఘం నాయకులు ఖాదర్‌బాషా, దూదేకుల పోరాట హక్కుల సంఘం నాయకులు మన్సూర్ అక్బర్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప సర్వజనాస్పత్రి ఆవరణంలోని మార్చురీ దగ్గర ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రేమిం చలేదనే ఉద్దేశంతో ఇంతటి ఘాతుకానికి పాల్పడిన విధానం సభ్యసమాజాన్ని నివ్వెరపరుస్తోందన్నారు. ప్రేమోన్మాద ఘటన చోటుచేసుకున్న వెంటనే ముఖ్య మంత్రి చంద్రబాబు స్పందించిన విధానం బాగుందని, బాధిత కుటు ంబానికి రూ.కోటి నగదు, ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల పొలాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు దస్తగిరమ్మ మృతదేహాన్ని పరిశీలించడానికి కడప, నంద్యాల జిల్లాలకు చెందిన దూదేకుల సంఘం నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పెద్దఎత్తున సంఘీ భావంగా తరలిరావడం గమనార్హం. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పగడాల ఆయిల్‌మిల్ ఓబులేస్, దూదేకుల సంఘం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఓ. రసూల్, ఆకు మళ్ల బాబు, రాయల్‌బాబు, ఖాదర్‌హుస్సేన్, బాదుల్లా, కుళ్లాయప్ప, నజీర్, సహా సుమారు 50 నుంచి 60 మంది దూదేకుల సంఘం నాయకులు హాజరయ్యారు.

పెళ్లి చేసుకోవాలని అడిగినందుకే హత్య : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప జిల్లా బద్వేల్ సమీపంలో హత్యకు గురైన బాలిక కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రొద్దుటూరు దస్తగిరమ్మ అనే బాలికను దహనం చేసిన దారుణ ఘటనపై పోలీసులు తక్షణం చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ నెల 20న మధ్యాహ్నం 12 గంటలకు బద్వేల్ పట్టణం రామాంజనేయనగర్‌కు చెందిన జక్కల విఘ్నేష్‌ను పట్టణ శివార్లలోని డిటిసి సమీపంలో బద్వేల్ రూరల్ సిఐ తన సిబ్బందితో కలసి అరెస్టు చేశారని పేర్కొన్నారు. విచారణ సమయంలో మృతురాలు తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతుండేదని చెప్పాడన్నారు. ఆమె నుంచి వస్తున్న ఒత్తిడిని తప్పించుకోవడానికి ముందస్తు ప్రణాళికతో పి.పి.కుంటకు రావాలని కోరినట్లు వెల్లడించాడని పేర్కొన్నారు. ఆమెను కలిసేందుకు కడప నుంచి బద్వేల్‌కు బైక్‌పై వస్తూ దారిలో ఆలంఖాన్ పల్లి సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో తన బైక్‌లో పెట్రోల్ పట్టుకున్నాడని చెప్పారు. బైక్ ట్యాంక్ పైపు నుంచి ఒక బాటిల్‌లోకి పెట్రోల్ పట్టుకుని బ్యాగ్‌లో ఉంచుకున్నాడని తెలిపారు. ఇద్దరు కలిసి పిపి కుంట సమీపంలోని అడవిలోకి వెళ్లారన్నారు. అక్కడ ఇద్దరూ శారీరకంగా కలుకున్న తరువాత ఆమె వివాహం గురించి అతడిని ఒత్తిడి చేయడంతోపాటు వారి మధ్య వాగ్వాదం చేటుచేసుకుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల సమయంలో ఆమెగొంతు నొక్కి కిందకు నెట్టాడని, దీంతో స్పృహ కోల్పోయిందని చెప్పారు. నిందితుడు తాను తెచ్చుకున్న బాటిల్‌లోని పెట్రోల్ ఆమెపై పోసి నిప్పంటించి మంటలు రేగిన తరువాత ఘటనా స్థలం నుంచి రోడ్డుపైకి వచ్చి ఆటోలో పరారయ్యాడని తెలిపారు. నేరం జరిగిన ప్రదేశంలో నిందితుడు మృతురాలి బట్టలు, తరగతి పుస్తకాలు, బ్యాగు, సగం కాలిన ఒక ఖాళీ పెట్రోల్ బాటిల్, కాలిన బట్టల బూడిద, నిందితుడు తాగిపడేసిన సిగరెట్ పీక, నేరం జరిగిన ప్రదేశంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నామని తెలిపారు. . నిందితులను త్వరితగతిన అరెస్టు చేయడానికి కృషి చేసిన కడప పోలీసుల సత్వర, సమర్థవంతమైన చర్యకు డిజిపి అభినందించారు.

సురక్షిత ప్రయాణం కల్పించడమే లక్ష్యం

జిల్లా ప్రజా రవాణా అధికారి రాము

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ప్రయాణికులకు అందరికీ అందుబాటులో ఉండి వారికి ఎపిఎస్ ఆర్‌టిసి బస్సులో సురక్షిత మైన ప్రయాణం కల్పించడం తమ లక్ష్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి పి. రాము పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో అర్‌టిసి డిపో, బస్సు స్టాండ్, బస్సులలో ఎలా ఆదాయం పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.



ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లా లో డిపోలు, బస్సు ల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 5 డిపోలున్నాయి . మదనపల్లి-1, మదనపల్లి-2, పీలేరు, రాజంపేట, రాయచోటి. జిల్లాలో మొత్తం 494 బస్సులు ఉన్నాయి. ఇందులో మదనపల్లి-1 ఆర్‌టిసి బస్సులు 87,హైర్ బస్సులు 26, మొత్తం 113, మదనపల్లె - 2లో ఆర్‌టిసి 69, హైర్ బస్సులు 15, మొత్తం 84 బస్సులున్నాయి. పీలేరులో అర్‌టిసి 66,హైర్ బస్సులు 24, మొత్తం 90, రాజంపేటలో ఆర్‌టిసి 48,హైర్ బస్సులు 31,మొత్తం 79, రాయచోటిలో ఆర్‌టిసి 87,హైర్ బస్సులు 41, మొత్తం 128 ఉన్నాయి.

జిల్లాకు కొత్త బస్సులు ఏమైనా వచ్చాయా?

అన్నమయ్య జిల్లాకు కొత్తగా 37 బస్సులు వచ్చాయి. ఆర్‌టిసి 15,హైర్ బస్సులు 22 వచ్చాయి. ఇందులో మదనపల్లి-1కి 7,హైర్ బస్సులు 5 మొత్తం 12, పీలేరు డిపోకు ఆర్‌టిసి 1,హైర్ బస్సులు 7, మొత్తం 8, రాజంపేటకు హైర్ బస్సులు 4, రాయచోటికి ఆర్‌టిసి 4,హైర్ బస్సులు 4, మొత్తం 8 బస్సులు వచ్చాయి.

జిల్లా నుండి ఇతర రాష్ట్ర ల కు బస్సులు ఏర్పాటు చేశారు?

అన్నమయ్య జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు మొత్తం 18 సర్వీసులు నడుస్తున్నాయి. బెంగళూరు 9, చెన్నై 3, బళ్లారి 2, హైదరాబాద్ 4, సర్వీసులు నడుపుతున్నాం. ఇందులో మదనపల్లి -1 నుంచి బెంగళూర కి 3, హైదరాబాద్‌కి 4, బళ్లారి 1 మొత్తం 8, మదనపల్లి - 2 నుంచి చెన్నైకి 1, పీలేరు నుంచి బెంగళూరుకి 3, చెన్నైకి 1, మొత్తం 4, రాజంపేట నుంచి బెంగళూరుకి 2, రాయచోటి నుంచి బెంగళూరుకు 1, చెన్నైకి 1, బళ్లారి 1, మొత్తం 3 బస్సులున్నాయి.

జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జిల్లా కేంద్రంలో ప్రయాణికుల సదుపాయాలు కోసం తాగు నీరు, కూర్చోవడం కోసం కుర్చీలు, బాత్రూంలు, క్యాంటీన్, ఫ్యాన్, పార్కింగ్, రిజర్వేషన్ కౌంటర్ కార్గో వంటి సదుపాయాలను ఏర్పాటు చేశాం.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?

మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నిమిషం తెలిసిందే. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి నివేదికలు రాలేదు. ఇంకా సమయం పడుతుంది.

కండక్టర్లు, డ్రైవర్లు ఎంతమంది ఉన్నారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా 808 మంది డ్రైవర్లు, 833 మంది కలెక్టర్లు ఉన్నారు.సిబ్బంది కొరత లేదు.

డ్రైవర్‌లకు శిక్షణ తరగతులు ఏమైనా నిర్వహిస్తున్నారు?

జనరల్‌గా ప్రతివారమూ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. ఇప్పటికే డ్రైవర్లకు 508 శిక్షణ తరగతులు అయిపోయాయి. ప్రస్తుతం 112 మంది డ్రైవర్లకు శిక్షణ అందిస్తున్నాం. మొత్తం 620 మందికి శిక్షణ తరగతులు అందిస్తాం. జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో కూడా క్రమం తప్పకుండా డ్రైవర్‌లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆదాయం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆర్‌టిసి స్థలాలను లీజుకి ఇవ్వడం, బస్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఉన్న స్టాళ్లకు టెండర్లు పిలవడం, తక్కువ ఆదాయం వచ్చే సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నా. కార్గో ఆదాయం పెంచుతున్నాం. పోలీస్, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ వారితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టి ఆర్‌టిసిని బలోపేతం చేయడంద్వారా ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రయాణికులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ఆర్‌టిసిలో ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదం. కావునా ప్రయాణికులు అందరూ ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించి సంస్థను బలోపేతం చేయాలి. ఆర్‌టిసి బస్సులో ప్రయాణం వల్ల జాగ్రత్తగా వారి వారి గమ్యానికి సురక్షితంగా చేరుకోవచ్చును.

మావోయిస్టుల దాడిలో జవాన్ మృతి

స్వగ్రామానికి చేరిన మృతదేహం - పాపిరెడ్డిపల్లెలో విషాద ఛాయలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

చత్తీస్‌గడ్‌లోని అబూజ్ మడ్ ప్రాంతంలో మావోయిస్టుల మైనింగ్‌బాంబు వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం, పేలి తోట్లపల్లి పంచాయతీలోని పాపిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన కొడవటికంటి రాజేష్ (37) మృతి చెందారు. చత్తీస్‌గడ్‌లోని ఐటిబిపి (ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్)లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ దళానికి చెందిన మరో ఇద్దరు జవాన్ కూడా దాడిలో మరణించారు. మరో ఇద్దరికి గాయలయినట్లు సమాచారం. ఐటిబిపి, బిఎస్ఎఫ్ దళాలు దుర్భేద ప్రాంతంలో సంయుక్తంగా మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ నిర్వహించి శనివారం మధ్యాహ్నం నారాయణపూర్ కు తిరిగి వ స్తుండగా కొడ్లియార్ గ్రామం వద్ద ఐఇడి పేలుడు సంభవించి పాపిరెడ్డి పల్లె గ్రామ జవాన్ కొడవటికంటి రాజేష్ మృతి చెందారు. రెండు నెలల కిందటే మృ తుడు తన స్వగ్రామంలో అందరితో కలిసి సంతోషంగా గడిపారు. సెలవులు ముగించుకుని తిరిగి విధుల్లో చేరారు. ఇంతలోనే ఈ ఘటనతో రాజేష్ మృతి చెందారు.

కొడవటి గంటి బాలమ్మ, జానయ్య దంపతులకు రాజేష్ పాపిరెడ్డిపల్లెలో 1988లో జన్మించారు. బద్వేల్ ఆర్‌సిఎం పాఠశాలలో 10వ తరగతి చదివారు. ఇంటర్ బ్రహ్మంగారిమఠంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పూర్తిచేశారు. ఇంటర్‌లోనే ఐటిబిపిలో ఉద్యోగం సాధించారు. అదే మండలం పలుగు రాళ్లపల్లిలోని తన అక్క కూతురు స్వాతిని వివాహం చేసుకున్నారు. మృతుడికి రిసెన్స్, రిషిక, రియాన్స్ అనే ముగ్గురు పిల్లలున్నారు. మరణ వార్త వినగానే కుటుంబంతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా రాజేష్ 2007వ సంవ త్సరం నుంచి జవాన్‌గా పని చేస్తున్నారు. భార్య సొంత గ్రామం పాపిరెడ్డి పల్లె లోనే ఉంటూ తమ పిల్లలను చదివించుకుంటూ ఉంటుంది.



రాజేష్ (ఫైల్‌ఫొటో)

స్వగ్రామం చేరిన మృతదేహం..

జవాన్ రాజేష్ మృతదేహం చత్తీస్‌గడ్ నుంచి ఆదివారం రాత్రి బి. మఠం మండలం పాపిరెడ్డిపల్లెకు చేరుకుంది. మృతదేహం రాగానే గ్రామానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో మృతునికి ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తారు. జవాన్‌కు నివాళులర్పించేందుకు కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరు కానున్నారు.

పాపిరెడ్డిపల్లెలో విషాదఛాయలు.. రాజేష్ మృతితో పాపిరెడ్డిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబం శోకసంద్రంలో మునిగి తేలింది. తోడుగా ఉంటాడనుకున్న భర్త మావోయిస్టుల దాడిలో మృతిచెందడంతో భార్య గుండెలు అవిసేలా విలపించింది. తండ్రి మరణంతో ముగ్గురు చిన్నారులు బోరున విలపించారు. వారి బాధను చూసి చుట్టుపక్కల వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.



దాతను సన్మానిస్తున్న అతిథులు

చైతన్య సంస్థలో అన్నదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కృష్ణారెడ్డి సిద్దార్థ కాలేజ్ యజమాని కృష్ణారెడ్డి గురు భక్తితో పాటు ఔదార్యాన్ని చాటుకున్నారు. తన గురువు, మదనపల్లె, చౌడేపల్లె పాఠశాలల్లో హెడ్మాస్టర్‌గా పనిచేసిన రంగనాథ గుప్త జ్ఞాపకార్థం కృష్ణారెడ్డి సిద్ధార్థ కాలేజ్, శ్రీనివాస డిగ్రీ కాలేజ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. 50 కిలోల బియ్యం, ప్లేట్లు, గ్లాసులు అందించారు. ఈ సందర్భంగా రంగనాథ గుప్తా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి, నివాళులర్పించారు. చైతన్య సంస్థ జనరల్ సెక్రెటరీ కవితారాణి మాట్లాడుతూ వంద దేవాలయాలు కలిస్తే ఒక విద్యాలయం అవుతుందన్నారు. అలాంటి కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్, డిగ్రీ కాలేజ్ విద్యా సంస్థల ద్వారా 1500 మంది విద్యార్థులకు విద్యనందిస్తున్న కృష్ణారెడ్డి తన గురువును స్మరించుకుంటూ ఆయన అడుగు జాడుల్లో నడవడం పలువురికి స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. అనంతరం కృష్ణారెడ్డిని పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయని అన్నారు. ఇక్కడ చదువుతున్న చిన్నారులకు తమ విద్యా సంస్థలో ఉచిత విద్య ఇవ్వడానికి సహకరిస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కోశాధికారి గిరిజమాల్, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం అధ్యక్షులుగా విష్ణు చైతన్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం : వాల్మీకి సంఘం వాల్మీకిపురం అధ్యక్షులుగా విష్ణు చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాల్మీకి సంఘం నూతనంగా ఏర్పాటైంది. సంఘం అధ్యక్షులుగా విష్ణు చైతన్య, ఉపాధ్యక్షులుగా రంజిత్ కుమార్, రాజగోపాల్, కార్యదర్శిగా భరత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా రమేష్, సభ్యులుగా లక్ష్మీదేవి, రెడ్డిప్రసాద్, సాంబశివ, భాస్కర్, రామచంద్ర, రాజేష్ కుమార్, రామక్రిష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా విష్ణుచైతన్య మాట్లాడుతూ వాల్మీకుల అభివృద్ధికి శాయశక్తిలా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో తనను అధ్యక్షులుగా ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి

ప్రజాశక్తి కడప అర్బన్ : ఆర్‌టిసి సమస్యలపై సోమవారం ఒక డయల్ యువర్ ఆర్‌టిసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రము 4 గంటల నుంచి 5 గంటల వరకు ఆర్టీసి సమస్యలపై ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను 9959225848 నంబరుకు ఫోన్ తెలియజేయవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో కట్టు కాలువ శుభ్రం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రామీణ మండలం, వేంపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాలతో బైగారి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నాయకులు జెసిబితో కాలువ గట్టు శుభ్రం చేయించారు. కదిరమ్మ, వెంకటమ్మ చెరువుల నుండి వచ్చే ఊటనీరు ప్రవహించే కాలువలను ఎమ్మెల్యే ఆదేశాలతో వేంపల్లి టిడిపి నాయకులు జెసిబితో శుభ్రం చేసి బురద మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాజీ జడ్‌పిటిసి రంగప్ప, మేళ్ల వెంకటరమణలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాలతో ఎగువన ఉన్న చెరువుల నుంచి ఊటనీరు ప్రవహించే కాలవలు పిచ్చి మొక్కలు గడ్డితో పేరుకుపోవడంతో టిడిపి నాయకుల సొంత నిధులతో శుభ్రం చేయించినట్లు తెలిపారు. కాలువలు శుభ్రం చేయడం వల్ల వేంపల్లి చెరువుకు, చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు ఊట నీరు చేరుతుందని అన్నారు. కార్యక్రమంలో బైగారి రాజకుమార్, చంద్రబాబు, మధు, కన్నెమడుగు సోమశేఖర్, మల్లెం ప్రకాష్ నాయుడు, కదిరప్ప, రాయచోటి శశికుమార్, బైగారి జగన్నాథ నాయుడు, ఉదయ్ కుమార్, తిరుపతి నాయుడు, చైర్మన్ సుబ్రహ్మణ్యం, గట్టు రాజు, సురేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఖాసీంఖాన్ కుమార్తె వివాహం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ సీనియర్ ఆడిటర్, సంఘసేవకులు లయన్ పఠాన్ ఖాసీంఖాన్ కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్‌లో వివాహ మహోత్సవం కన్నులపండుగగా సాగింది. ప్రముఖులు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్‌బాబు, సీనియర్ నాయకులు ఆలంకాన్ పల్లె లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు విజయజ్యోతి, సీయర్ నాయకులు సయ్యద్ సలావుద్దీన్, నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, పీస్ స్కూల్ చైర్మన్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సయ్యద్ గౌస్‌పీర్, ఎస్.ఎ.సత్తార్, టిడిపి నాయకులు జిలానీబాష, జెకె యూత్ ఖాదర్‌బాష, క్రికెట్ ఆటగాడు పైడికాల్వ విజయ్‌కుమార్, ఖూన్ కా రిష్తా అధ్యక్షులు తారీఖ్‌అలి, ఖాసీంఖాన్ సోదరులు ఆడిటర్ పఠాన్ షరీఫ్‌ఖాన్, లయన్ అక్బర్‌ఖాన్, కుమారులు, కుమార్తెలు, శ్రేయోభిలాషులు, కదిరి నుంచి బంధువులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున హాజరై వధువరూలను ఆశీర్వదించారు.



ఖాసీంఖాన్ అల్లుడితో ప్రముఖులు



నేలకూలిన చింత చెట్టు

సబ్ కలెక్టరేట్‌లో నేలకూలిన చింతచెట్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని చింత చెట్టు ఆదివారం జాతీయ రహదారిపై హఠాత్తుగా కూలిపోయింది. సైకిల్‌పై వెళుతున్న చంద్రాచారి గాయపడగా తృటిలో పెనుప్రమాదం తప్పింది. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాల మేరకు వన్ టౌన్ సీఐ చాంద్ బాషా, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, టిడిపి యువనేత పూలకుంట్ల హరిబాబు, పులగంటి మల్లికార్జున, మాకినేని చంద్రశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అటవీశాఖ అధికారులు చెట్టును రోడ్డుపైన లేకుండా తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు వాహన దారులకు ఇబ్బంది లేకుండా దారి మళ్లించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చింతచెట్టు అకస్మాత్తుగా కూలిన విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తమను అప్రమత్తం చేశారని అన్నారు. అధికారులతో కలిసి చెట్టును తొలగించడంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ శ్రీ ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని భారత దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన వాల్మీకి బంధు మిత్రులకు కేంద్ర, ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. 2025 వాల్మీకి జయంతి లోపల వాల్మీకులను ఎస్‌టి జాబితా పునరుద్ధరణ చేయాలని కోరారు. జిల్లాలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు, నాదెండ్ల విద్యకి, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్,మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధా, రంగస్వామి నాయుడు, బీధం గురునాథ్ యాదవ్, పసుపులేటి వరప్రసాద్, ప్రజా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జయంతి విజయవంతానికి కృషిచేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దల జయసింహ, ప్రొద్దుటూరు రామప్ప, ప్రొద్దుటూరు నారాయణస్వామి, ముక్కండ్ల జగదీష్, బొంత సోము,రాములకు కృతజ్ఞతలు తెలిపారు.


కెవిపల్లి ఎస్‌ఐగా చిన్నరెడ్డప్ప బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పీలేరు

కెవిపల్లి ఎస్‌ఐగా వి.చిన్నరెడ్డప్ప ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా, తాడిపత్రి సబ్ డివిజన్, పెద్ద ఒడుగురు మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై కెవి పల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని, అలాంటి వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సమాచారం అందిస్తూ సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ జకియాఖానంపై కేసు నమోదు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



తిరుమలలో జరిగిన ఘటనపై ఎమ్మెల్సీ, శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానంపై తిరుమలల కేసు నమోదైంది. ఆమెతోపాటు చంద్రశేఖర్, ఆమె పిఎ కృష్ణతేజపై బెంగుళూరుకు చెందిన శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్రేక్ దర్శనంతోపాటు వేదాశీర్వాదం కోసం రూ. 65 వేలు తీసుకుని మోసం చేశారని శివకుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ బెంగళూరుకు చెందిన వారి తనతోపాటు శ్రీవారి దర్శనానికి వచ్చిన మాట వాస్తవమేనని, తాను తిరిగి వచ్చిన తర్వాత అక్కడ ఏం జరిగిందో తెలియ దన్నారు. కృష్ణతేజ అనే అతను ఎవరో కూడా తనకు తెలియదని చెప్పారు. గతంలో భక్తులకు ఇబ్బంది కలిగిస్తున్నాడన్న కారణంతో అతన్ని తొలగించానని పేర్కొన్నారు. తనపై రాజకీయంగానే కుట్ర చేస్తున్నారని వాపోయారు. తాను మైనార్టీ మహిళ అనే రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటివి చేస్తున్నార ఆమె ఆరోపించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి:'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.పోలీసు అనే పదానికి సేవ, త్యాగం, గంభీరం, తెగువ పర్యాయ పదాలన్నారు.1959 అక్టోబర్ 21 న జరిగిన దురదృష్ట సంఘటననుగుర్తుచేసుకుంటూ వారి త్యాగాలును స్మరణం చేసుకోవడం కోసం ప్రతి ఏటా అక్టోబర్ 21 న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ఏ అన్యాయం జరిగినా, ఏ ఆపద కలిగినా ప్రజలకు ముందుగా గుర్తొచ్చేది పోలీసు అని, పోలీసు లేని సమాజాన్ని ఊహించ లేమని పేర్కొన్నారు. శాంతి భద్రతల కట్టడిలో పోలీసు వ్యవస్థ చాలా కీల కంగా పనిచేస్తోందన్నారు. విపత్కర పరిస్థితుల్లో వారు కుటుంబాలకు సైతం దూరంగా ఉంటూ విధులు నిర్వ హిస్తున్న పోలీసు వ్యవస్థపై ఎంతో గౌరవం ఉందన్నారు. అమరులైన పోలీసులకు అయన నివాళులు అర్పించారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు : పిడుగుపాటుతో మృతి చెందిన రైతు కుటుంబాన్ని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం పీలేరు నియోజకవర్గం పరిధిలోని కెవిపల్లి మండలం, నూతనకాలువ పంచాయతీ, గుట్టలపైకి చెందిన నాగరాజ అనే రైతు ఆదివారం తన పొలం దగ్గర వేర శనగ కుప్ప వేస్తుండగా పిడుగు పడి మృతి చెందాడు. అతని భార్య పార్వతి, తల్లి చిన్నక్క కూడా తీవ్ర గాయాల పాలయ్యారు. సమాచారం అందుకున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి చేరుకుని ముందుగా రైతు నాగరాజ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం క్షతగాత్రులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీలేరు టిడిపి నాయకులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, అమర్నాథ్ రెడ్డి, వసంతాల రాజా, మహమ్మద్ పీర్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే


వీరబల్లి: కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ నాగార్జునచారి

ఘనంగా 'చమర్తి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీలో రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మ దిన వేడుకలను మట్లి సర్పంచ్ నాగార్జున చారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. మట్లి ఎల్లంపల్లి కూడలిలో కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోడం లక్ష్మయ్య, గుదే నాగభూషణం నాయుడు మాజీ సర్పంచ్ నాగమణి, ఎంకే జయచంద్ర, వెంకటేశ్వర్లు, క్ర చెక్క వెంకట రమణ, హై స్కూల్ చైర్మన్ నాగేశ్వరరావు. పుల్లగూర కేశవులు కనితి వెంకటరమణ , సెట్టెం నాగార్జున , వెంకటేశు,ధర్మయ్య కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు జన్మదిన వేడుకలను ఒంటిమిట్ట లోని స్థానిక హరితహోటల్‌లో యువ నాయకుడు కూండ్ల హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా హరినాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రాజు నిగర్వి హుందాతనం కలిగిన వ్యక్తిని అన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం కోసం అన్నమయ్య జిల్లాలో అహర్నిశలు పనిచేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. టిడిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు మనోధైర్యం ఇస్తూ వారి అభివృద్ధి కొరకు తోడ్పాటు ఇస్తున్నారని అన్నారు. టిడిపి తరపున ఎంతోమంది పేదలకు అండగా నిలబడి ఆర్థికంగా ఎన్నో సహాయ సహకారాలు అందించారని అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల నుండి పెద్ద సంఖ్య లో కార్యకర్తలు నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినం దుకు ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో శివారెడ్డి బోడిచర్ల శ్రీను, మల్లి, రఘు రాంరెడ్డి, మౌలాలి, బాషా, వేణు, శరత్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి,పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న టిడిపి నాయకులు

కుక్కల బెడదతో జనం హడల్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని రెడ్డిపల్లె పరిసర ప్రాంతాల్లో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని వ్యాపారస్తులు, ప్రజలు హడలెత్తిపోతున్నారు. చికెన్ దుకాణాల వద్ద అదునుగా తీసుకొని చికెన్ షాపుల వద్ద యజమానుల కళ్ళుగప్పి కోళ్లను తీసుకెళ్లడం జరుగుతుందని వ్యాపారస్తులు వాపోతున్నారు. కుక్కల సంచారం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ ఉండే కుక్కలు దారిన పోయే వారిని, వ్యాపార నిమిత్తం గ్రామాల్లోకి వచ్చే తోపుడు బండ్ల వారిని, గంపల మీద తెచ్చుకుని అమ్మేవారి పై దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన చెందు తున్నారు. వాహనాలపై వెళ్లే వారిని కూడా వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. కుక్కల బెడదతో జాతర, పండుగలకు కూడా వారి బంధువులను పిలుచుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో సాధారణంగా పారిశుధ్య సమస్య అధికంగా ఉంటుందని, దానికంటే కుక్కల బెడదే ఎక్కువగా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఏ మారినా కుక్కలు ప్రజలపై తిరగబడుతున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ ప్రజలను కుక్కల బెడద నుంచి రక్షించాలని స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

పేదలకు అల్పాహారం

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ అరవపల్లి బంగ్లా కూడలిలో స్పెషల్ పోలీసు ఎస్ఐ లయన్ మన్నెం రామమోహన్ కుమారుడు మన్నెం యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా లయన్స్, వాకర్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో ఆది వారం పేదలకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో లయన్ మన్నెం రామ మోహన్, లయన్ కుప్రామణి యాదవ్, వాకర్ మోడపోతుల రాము, న్యాయవాది దాసరి నరసింహులు, వాకర్ గాడి సునీల్ రెడ్డి, గంధం గంగా ధర్, తీగల కుంట వెంకటేష్, గుండు సురేష్ పాల్గొన్నారు.

మండలానికి అబ్దుల్ కలాం జాతీయ పురస్కారాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవం గుంటూరు పట్టణంలోని ఎసి కళాశాలలో అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ యాజమాన్యం అవార్డులో బి.కొత్తకోట మండలానికి దక్కడం శుభపరిణామని ఎంఇఒ రెడ్డి శేఖర్ హర్షం వ్యక్తం చేశారు.అన్నమయ్య జిల్లా నుంచి పట్టణంలోని భారత్, విద్యార్థి పాఠశాలల డైరెక్టర్ పూజారి శ్రీనివాసులు ఉత్తమ యాజమాన్యం అవార్డు, ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును సోషల్ స్టడీస్ వినయ్ తేజలు గుంటూరు ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

పాము కాటుతో మహిళా రైతుకు తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పాము కాటుతో మహిళా రైతు తీవ్ర అస్వస్థతకు గురైంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పీటీఎం మండలం, పులికల్లుకు చెందిన సోమశేఖర్ భార్య అనిత ఆదివారం పాడి ఆవులను పొలం పట్టుకెళ్లింది. పొలంలో ఆవులను కట్టేసి వ్యవసాయ పనులు చేస్తుండగా, చెట్ల మధ్యలో ఉన్న పాము ఆమెను కాటేసింది. ఆమె తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు.

టిడిపిలో చేరిన రాచవేటివారిపల్లె సర్పంచ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో రాచవేటివారిపల్లె పంచాయతీలోని ఎగువ మాచిరెడ్డిగారిపల్లెలో ఆదివారం నిర్వహించిన పల్లెపండుగ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో వైసిపి పార్టీకి చెందిన పలువురు టిడిపిలో చేరారు. వైసిపి రాచవేటివారిపల్లె పంచాయతీ సర్పంచ్ సుబ్రమణ్యం(మధు) టిడిపి వీడి టిడిపిలో చేరగా, ఆయనతోపాటు ఎగువ మాచిరెడ్డిగారి పల్లెకు చెందిన ఇటుకల బట్టి చంద్రారెడ్డి, రాచవేటివారిపల్లి పంచాయతీలోని వార్డు మెంబర్లు చక్రపాణి రెడ్డి చేరగా, మరో వార్డు మెంబర్ షర్మిల తన భర్తతో కలిసి టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే షాజహాన్ భాష వారికి పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న తరుణంలో, తమ గ్రామాలను అభివృద్ధి బాటలో నిలపడానికి తాము టిడిపిలో చేరినట్లు తెలిపారు. గ్రామాలు పటిష్ఠంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం కూడా అభివృద్ధి చెందగలవని అన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ భాష సహాయ సహకారాలతో రాచవేటివారి పల్లె పంచాయితీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా పార్టీలోకి వచ్చిన వారికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. కార్యక్రమంలో రాటకొండ మధుబాబు, మాజీ జడ్పిటిసి రెడ్డప్ప రెడ్డి, సుధాకర్ రావు, మల్లికార్జున, శంకర, నరసింహారెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


టిడిపిలో చేరుతున్న వైసిపి పార్టీ సర్పంచ్, నాయకులు

పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ : ఎమ్మెల్యే


సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ పట్టుకుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంత సముద్రం పంచాయతీలోని సిద్ధవాండ్లపల్లె, పాపక్కగారిపల్లి, పుల్లారెడ్డిపల్లి పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 30 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలను టిడిపి యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాల వల్ల రైతులు ప్రజలు ఆనందంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం పల్లె పండుగ వారోత్సవాలలో ప్రజలు, అధికారులు పాల్గొని విజయవంతంగా సిసి రోడ్ల నిర్మాణాలను చెపడతున్నారని అన్నారు. మాది అడవుల నరికే ప్రభుత్వం కాదని, అభివృద్ధి చేసే ప్రభుత్వమని పేర్కొన్నారు. గ్రామాల్లో రోడ్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని తాగునీటి సర ఫరా కూడా సక్రమంగా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి అనంతసముద్రం పంచాయతీలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు. సిఎం చంద్రబాబుతో గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, వీధిదీపాలు, సిసి రోడ్లు వంటి మౌలిక వసతులు ఏర్పడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జయశ్రీ, ఎపిఒ శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఆర్ సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, జనసేన మండల నాయకుడు పసుపులేటి వెంకటరమణ, ముద్దా సుభాష్ రెడ్డి, వెంకటసుబ్బయ్య యాదవ్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో నిమ్మనపల్లి అభివృద్ధి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : నిమ్మనపల్లి మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించినట్లు మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్‌బాషా తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లి మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రతి గ్రామంలోనూ మంజూరైన సీసీ రోడ్ల పనులకు స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివృద్దే లక్ష్యంగా చేసుకొని పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. మండలంలో కూడా ప్రతి పంచాయతీలోనూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మొదటి దశలో రూ.1.50 కోట్లతో 40 ప్రాంతాలలో సిసి రోడ్లను వేస్తున్నామని, కోటి రూపాయలు విలువగల మురుగునీటి కాలువలను నిర్మించడానికి తలపెట్టినట్లు తెలిపారు. త్వరలో రెండవ దశలోనూ మరో రెండు కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణాలను చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. మొత్తంగా నిమ్మనపల్లి మండల వ్యాప్తంగా గ్రామాలలో సిసి రోడ్లు కానీ, మురుగునీటి కాలువలు ఏర్పాటు కానీ పూర్తి చేయాలంటే సుమారు 25 కోట్ల రూపాయలకు మించి నిధులు అవసరమవుతుందని తెలిపారు. అందుకు కార్యాచరణ రూపొందించి, నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. తాగునీటి సౌకర్యం, రోడ్డు సౌకర్యం, మురుగునీటి కాలువల ఏర్పాటు, నీటి ట్యాంకర్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం వంటి వసతులపై తమ ప్రభుత్వ ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. వైసిపి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిని, గ్రామాలలో మౌలిక వసతుల ఏర్పాటును పూర్తిగా నిర్వీర్యం చేశారని, దీనివలన ప్రస్తుతం ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు పూర్తి అండగా నిలుస్తూ వారికి అవసరమైన ప్రతి పనిని చేసి పెడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 127 రోజుల్లోనే గ్రామాలలో ఇటువంటి అభివృద్ధి జరుగుతుంది అంటే ప్రతి పల్లెలోనూ పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చిన ఘనత సిఎం, డిప్యూటీ సిఎంలకే చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, రాజన్న, రెడ్డప్పరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసుల రెడ్డి, సుధాకర్ రావు, శ్రీపతి, ఓబుల్ రెడ్డి, రమణ, నాగరాజ నాయుడు, జనసేన మండలాధ్యక్షులు ప్రదీప్ సింగ్, ఉపాధ్యక్షులు ఈతకట్ట చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కళ్యాణ్ సింగ్, సర్పంచులు శ్రీవాణి నవీన్ పాల్గొన్నారు.


పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పదవుల కన్నా..ప్రజాసేవే లక్ష్యం

- పార్టీ విధానాలే దిక్సూచి..ప్రజలే బలం
- రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం అనే నినాదంతో 1982 మార్చిలో నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ విధి-విధానాలు, ఎజెండానే దిక్సూచిగా అడుగులు వేస్తున్నాని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. తనకు పదవుల కన్నా ప్రజాసేవే ముఖ్యమని, ఆదర్శవంతమైన రాజకీయ నాయకుడిగా ఉండటమే తనలక్ష్యమని పేర్కొన్నారు. ఆదివారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ఆది నుంచి రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను 2014లో ప్రత్యక్ష రాజకీయ రంగప్రవేశం చేసినట్లు తెలిపారు. ప్రజలే దేవుళ్ళు, సమాజమే దేవాలయం గా భావించి తాను ప్రజలకు తన వంతు ఏదైనా చేయాలన్న సత్సంకల్పంతో రాజు విద్యాసంస్థలను స్థాపించి పేద, మధ్య తరగతి వారికి అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతోమంది పేద విద్యార్థులను ఉచితంగా చదివిస్తూ ప్రయోజకులుగా తీర్చిదిద్దుతూ సమాజంలో పేద విద్యార్థులను ఉన్నత స్థానాలలో కూర్చోబెట్టేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ధనము, పదవులు శాశ్వతం కాదని కేవలం విద్య మాత్రమే మనిషిని మహోన్నత స్థాయిలో నిలబెడుతుందని నమ్మిన తాను తమ విద్యా సంస్థల ద్వారానే కాక ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతోందని అన్నారు. విద్యాదానంతోనే సరిపెట్టుకోక ప్రజలకు మరింత సేవ చేయాలన్న తపనతో 2014 లో రాజకీయ రంగ ప్రవేశం చేశానని పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలలో సైతం విస్తృతంగా పర్యటించి ప్రజల కష్టనష్టాలు తెలుసుకుని పరిష్కరిస్తూ ఆత్మ సంతృప్తి పొందుతున్నానని అన్నారు. ప్రజా సేవ మాత్రమే తనకు సంతృప్తినిస్తుందని, ప్రజలకు మరింత సేవ చేయాలంటే అధికారమే మార్గమని తలచి రెండు పర్యాయాలు టికెట్ ఆశించి దక్కకపోయినా నిరాశ చెందకుండా పదవుల కన్నా ప్రజల ఆశీస్సులే తనకు ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలను నెరవేర్చుతూ కష్టాలలో ఉన్న ప్రజలకు సాయం చేస్తూ అధిష్టానం ఆదేశాలను శిరసా వహిస్తూ ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. అధికారం, పదవులు ఉన్నా.. లేకపోయినా రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి, నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-రామసముద్రం

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. రామసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 37 ఏళ్ల క్రితం చదువుకున్న 90 మంది పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నాడు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులు విచ్చేశారు. వారు చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. బ్యాచ్ తరపున ఆర్గనైజేషన్ ఏర్పాటు కూడా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో టిటిడి ఆస్థాన గాయకుడు చంద్రశేఖర్, సుబ్రమణ్యం, కైకాల శ్రీనివాసులు, రమేష్, కైకాల అన్సర్‌బాషా, కాంతా రెడ్డి, నరేంద్ర, విజయ్ కుమార్ స్వామిపాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

- మున్సిపల్ కమిషనర్ రాముడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆధార్ కార్డులు ఇంకా చాలా వరకు బయోమెట్రిక్ అప్డేషన్, డాక్యుమెంట్స్ అప్డేషన్ పెండింగ్ ఉన్నందున ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ప్రత్యేక కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు పులివెందుల పురపాలక సంఘ పరిధిలో నిర్దేశించిన సచివాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న వెంకటాపురం, జిల్లా పరిషత్ హైస్కూల్ నగరిగుట్టలో, 23న ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల అహోబిళపురం, రమణప్ప సత్రం పాఠశాల మెయిన్ రోడలో, 24న ఎంజెపిఎపిబిసి డబ్ల్యూ ఆర్ఎస్ పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ (వైఎస్‌విఆర్‌ఎం)లో, 25న అంగన్వాడీ కేంద్రం ఎస్‌బిఐ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆధార్ నమోదు కేంద్రాలు ఉంటాయన్నారు. ఆ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర పరిస్థితి అధ్వానం : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కూటమి పాలనలో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని పేర్కొన్నారు. డయేరియాను అరికట్టలేని దద్దమ్మ ప్రభుత్వంగా తయారైందని విమర్శించారు. జూన్, జులైలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు డయేరియా రోగులతో కిటకిటలాడాయన్నారు. జగ్గయ్యపేట, సామర్లకోట, పిడుగురాళ్ల, ఖాజీపేట తదితర ప్రాంతాల్లో అనేక మంది ఆస్పత్రుల పాలయ్యారని, ఆరు మంది చనిపోయినట్లు వివరించారు. ఆగష్టులో డెంగీ, మలేరియా, చికెన్‌గన్యా వ్యాధులు విజృంభించాయన్నారు. మలేరియా కేసులు 2022లో 1,237, 2023లో 3,840 నమోదు కాగా 2024 ఆగష్టు 25 వరకు 4,610 కేసులు నమోదైనట్లు తెలిపారు. డెంగీ కేసులు 2022లో 2,174, 2023లో 3,252 నమోదు కాగా.. 2024 ఆగష్టు 25 నాటికి 2,955 నమోదైనట్లు పేర్కొన్నారు. ఇందుకు కారణం తాగునీరు కలుషితం కావడమన్నారు. అంతేకాక పారిశుధ్యం లోపించడం మరో కారణమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో బాలికలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేల్‌లో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన విగ్నేష్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. కర్నూల్ జిల్లా అప్సర మండలం నగరూరు గ్రామంలో అశ్విని అనే విద్యార్థిని సన్నీ అనే యువకుడు పురుగుల మందు తాగించడంతో ఆమె కూడా మృతి చెందిందన్నారు. కడపలో టిడిపి నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి మీద కొందరు వ్యక్తులు కర్రలతో పట్టపగలు దాడి చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలు, పారిశుధ్యం, ఆస్పత్రుల్లో కనీస సదుపాయాల మీద దృష్టి సారించాలని తులసిరెడ్డి కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

- 300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. కడపకు చెందిన శ్రీ శివశంకర్ ఆసుపత్రి, కడప మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో వేంపల్లె మండల శాఖకు చెందిన మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బిపి, షుగర్, ఉబ్బసం, క్యాన్సర్, రక్తహీనత, థైరాయిడ్, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు జనరల్ మెడిసిన్ వైద్యులు వంశీ విహారి, గైనకాలజిస్ట్ వైద్యులు సాయిచరిత్ర, ఆర్థోపెడిక్ వైద్యులు గద్దె శివ బాబు వైద్య పరీక్షలు చేసి సలహాలిచ్చారు. స్థానిక వైద్యులు ఆరుసేర్ల రంగయ్య, రాజారాం, అరుణ్, ఫిజియోథెరపీ యోగేశ్వర బాబు, నిర్మల ల్యాబ్ నిర్వాహకులు శేఖర్ బిపి, షుగర్ వైద్య పరీక్షలకు తోడ్పాటునిచ్చారు. రోగులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చక్రపాణిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మానవత వ్యవస్థాపకులు ఎన్.రవిచంద్రరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రాటాల గోపి, కడప డైరెక్టర్ బోర్డు సభ్యులు శివశంకర్‌రెడ్డి, కో-చైర్మన్ కావలి కృష్ణతేజ, మండల శాఖ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, డైరెక్టర్ బోర్డు సభ్యులు రామమునిరెడ్డి, చల్లా బాలాజీ, ఓబుల్‌రెడ్డి, కావలి ముత్యాలయ్య, రామ మనోహర్‌రెడ్డి, శ్రీకళ, ఆలమూరు శివ, మదర్ థెరీస్సా ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, గోపి, దివాకర్, చలపతి, వెంకటసుబ్బయ్య, చైతన్య స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

పిడుగుపాటుకు 18 గొర్రెలు మృతి

ఆదుకుంటామని మంత్రి 'మండిపల్లి' వెల్లడి

ప్రజాశక్తి-గాలివీడు/రాయచోటి

మండలంలోని తూముకుంట పంచాయతీ నాయనవారిపల్లిలో రైతు రామప్పనాయుడుకు చెందిన 18 గొర్రెలు పిడుగుపాటుతో మృతి చెందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం పిడుగుపాటు తమకు జీవనాధారమైన 18 గొర్రెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల పెంపకంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నామని చెప్పారు. అకాల వర్షం పిడుగు ప్రమాదం వల్ల ఏకంగా 18 గొర్రెలు మృత్యువాత పడటంతో దాదాపు మూడు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గొర్ల యజమాని రామప్పనాయుడుని పరామర్శించి మృతి చెందిన గొర్లకు సంబంధించి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులతో మంత్రి మాట్లాడి ప్రభుత్వం తరపున పొట్టేళ్లకు అందాల్సిన ఆర్థికసాయం ఏమైన ఉంటే వెంటనే మంజూరు చేయించాలని వారిని ఆదేశించినట్లు తెలిపారు.

అరిగే సుమంత్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-నందలూరు



మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లె గ్రామానికి చెందిన అరిగే సుమంత్ కు ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మద్రాస్ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ తనకు పర్యవేక్షకులుగా డాక్టర్ తేజేంద్రా దీక్షిత్, ప్రొఫెసర్ వి.కామకోటి, ప్రధాన మంత్రి భద్రత సలహామండలి సభ్యుడు, ఆర్టిఫికల్ ఇంటెలిజెన్స్ టాస్క్ ఫోర్స్ చైర్మన్, డైరక్టర్ ఐఐటీ మద్రాస్, ప్రొఫెసర్ రామచంద్రరావు వ్యవహరించారని అన్నారు. తన పరిశోధనలు ఎలక్ట్రానిక్స్ రంగంలో సెమీకండక్టర్ మీద చేసినట్లు తెలిపారు. నందలూరుకు చెందిన అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ దివంగత అరిగే సుబ్రహ్మణ్యం కుమారుడైన సుమంత్‌కు డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులు ,మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-పుల్లంపేట

జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించిన పిఆర్‌టియు రాష్ట్ర కమిటీ నాయకుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీపాల ఉమామహేశ్వర్‌ను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఆర్. ఉప్పరపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు తనపై నమ్మకం ఉంచి పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై జిల్లా నాయకులతోను, రాష్ట్ర నాయకులతోను తెలియజేసి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.

రెవెన్యూ సమస్యలతో రైతులు సతమతం

-ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని చాలామంది రైతులు రెవెన్యూ సమస్యలతో సతమతం అవుతున్నారని ఫార్మర్స్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ఆర్.రాజశేఖర్‌రాజు పేర్కొన్నారు. వీరబల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం ఫ్రీ హోల్డ్ సర్వే చేపట్టే విధంగా రైతులు ప్రధాన సమస్యలపై చెబితే రైతులకు ఇబ్బందులు తొలిగే అవకాశం ఉందన్నారు. చాలామంది పిత్రార్జిత తదితర భూములకు సంబంధించి రెండు కోట్ల ఖాత ఉందని మిగులు భూములుగా ఉన్నాయని సాగు చూపి రెవెన్యూ కార్యాలయ చుట్టూ రైతు సమస్యలు తీరక కాళ్లరిగేలా తిరుగుతు న్నారని అన్నారు. సానిపాయిలో రీ సర్వే చేపట్టి పాస్ పుస్తకాలు ఇచ్చిన చాలా మందివి 1బి రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇవే కాకుండా కొందరు అండదండలు ఉన్నవారు పిత్రార్జిత భూములు సైతం నంబర్ ఆన్‌లైన్ చేసుకుని అసలు యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటివి ఒకరి భూమిని మరొకరికి ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా ఎలా ఆన్‌లైన్ చేశారని ప్రశ్నించారు. మండలంలో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం విద్యుత్ శాఖలో అధునాతన (స్మార్ట్) మీటర్లు ఏర్పాటు చేసి కొత్త ఫీచర్ల తో సరఫరాను అంది స్తున్నట్లు ఆ శాఖ ఎఇ దినేష్ కుమార్ తెలిపారు. సింహాద్రిపురం ప్రభుత్వ కార్యాల యాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ మండల పరిధిలో మొదటి విడతలో ప్రభుత్వ, కేటగిరి-2కు సంబంధించి 940 కనెక్షన్లు ఉన్నాయన్నారు. వీట న్నిటికీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో విద్యుత్ వినియోగంలో స్మార్ట్ మొబైల్స్ వాడుక పెరగనుందన్నారు. తమ సెల్‌లోనే యాప్ ద్వారా తమ విద్యుత్ సర్వీసుకు ఎంత మొత్తం రీఛార్జ్ చేయాలనుకుంటే అంత మొత్తానికి చేసుకోవచ్చన్నారు. స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ అనుసంధానంతో మరిన్ని ప్రయోజనాలు వినియోగదారుడికి లభిం చనున్నాయన్నారు.

సైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

సర్ సివిరామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అదివారం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కాలేజీలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఫిజిక్స్‌లో కాంతి పరావర్తనం, వక్రీభవనానికి సంబంధించి ప్రయోగాలను చేసి చూపించారు. బయాలజీకి సంబంధించి ఏకదళ బీజ, ద్విదళ బీజ, కాండం వేరు, ఆకు అడ్డుకోతలు, జీర్ణవ్యవస్థ గురించి వివరించారు. ఫిజిక్స్, బయాలజీ ఉపాధ్యాయులు 40 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు గోపీనాథ్‌రెడ్డి, నరసింహులు, తిరుమల కొండుపాల్గొనారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడి ఆదివారం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేరారు. బాధితుల కథనం మేరకు.. మదనపల్లి మండలం కోళ్ల బైలు పంచాయితీ జగన్ కాలనీకి చెందిన రూపేష్, నీరుగట్టు వారిపల్లె లోని కాట్లాటపల్లె రోడ్డు ఆంజనేయ స్వామి గుడి వద్ద నిలబడి ఉండగా స్కూటర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయ పడ్డాడు. మదనపల్లె ఆస్పత్రి నుంచి బెంగుళూరుకు రెఫర్ చేశారు. పుంగనూరుకు చెందిన స్వాతి బైక్‌పై వెళుతూ అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడింది. బి.కొత్తకోట లోని చలిమామిడి గ్రామం, దయాలోళ్లపల్లెకి చెందిన రవి, రాధ దంపతులు వాల్మీకిపురం మండలం, చింతపర్తి హాస్టల్ చదువుతున్న కుమారుడు పవన్‌ను వదిలడానికి బైక్‌పై బయలు దేరారు. మార్గమధ్యం లోని కంటేవారిపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రవి, రాధ, పవన్‌లు గాయపడ్డారు.